సాక్షి పెద్దపల్లి

బుధవారం ׀ 13 ׀ మార్చి ׀ 2024



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు: అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి కొండగట్టుకు చేరుకున్న భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:31	గురు 5:04

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.0/26.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, పక్కన డీఎం శ్రీకాంత్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ రైస్ డెలివరీ వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌తో కలిసి మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని సకాలంలో బిడ్డర్లకు అందించాలని మిల్లర్లను ఆదేశించారు. గత యాసంగి సీజన్‌కు సంబంధించి 2.06లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలోని 132 రైస్‌మిల్లులకు కేటాయించామని, వారంతా సకాలంలో అప్పగించాలని సూచించారు.

సీపీని కలిసిన ఆర్జీ–2 జీఎం



సీపీని సన్మానిస్తున్న సూర్యనారాయణ

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌ను మంగళవారం ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఏరియాకు సంబంధించిన శాంతిభద్రతల విషయాలపై చర్చించారు. జీఎం వెంట సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహ్మద్ ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

పెద్దపల్లిరూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, ఆయాల అపరిష్కృత సమస్యలు పరిష్కరించకుండా వారిపై మరింత పనిభారం పెంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని, ఆన్‌లైన్ సర్వే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు వేసవి సెలవులు వర్తింపజేయాలన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ కి వినతిపత్రం అందించారు. నాయకులు వనజారాణి, రామలక్ష్మి, కమలేశ్, శోభ, సులోచన, కృష్ణకుమారి, స్వరూప, సుగుణ, జయసుధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి ధర రూ.7,632

పెద్దపల్లిరూరల్: వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం పత్తి క్వింటాల్‌కు ధర రూ.7,632గా నమోదైంది. కనిష్ఠంగా ధర రూ.6,011, సగటు ధర రూ.7,431 నమోదైనట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

ఆధునిక సాగు పద్ధతులపై టెలికాన్ఫరెన్స్



రైతులతో కలిసి టెలికాన్ఫరెన్స్ వీక్షిస్తున్న డీఏవో

కమాన్‌పూర్: రైతునేస్తంలో భాగంగా కమాన్‌పూర్ మండలం గుండారం రైతువేదికలో మంగళవారం జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సుచరిత, శ్రీనివాస్, ప్రగతి కుమారిలు రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, పండ్ల తోటల్లో తీసుకోవాల్సిన చర్యలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ప్రతీ వారం నిర్వహించే టెలికాన్ఫరెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో బండి ప్రమోద్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కేసీఆర్, వినోద్‌కుమార్



కరీంనగర్ కదనభేరి సభలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వేదికపై పోచారం శ్రీనివాస్, మహమూద్ అలీ, వినోద్ కుమార్, కడియం శ్రీహరి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మధుసూదనాచారి, రసమయి బాలకిషన్, సతీశ్‌బాబు, రవిశంకర్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు





సభకు హాజరైన ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు



రైతులను చూస్తే.. కన్నీళ్లు ఆగట్లే..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎకరమైనా ఎండిందా?

- చెరువుల్లో మత్తళ్లు దూకిన నీరు మాయమెలా?
- స్మార్ట్‌సిటీ, రైల్వే, రహదారులు తెచ్చిన సమర్థుడు వినోద్
- బండికి, వినోద్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం
- తెలంగాణ గళం కోసం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి
- సిరిసిల్ల ఆత్మహత్యలు ఆపేందుకే బతుకమ్మ చీరలు
- కదనభేరి సభలో కాంగ్రెస్, బీజేపీలపై మాజీ సీఎం కేసీఆర్ నిప్పులు

కరీంనగర్‌కు బండి చేసిందేంటి?: వినోద్



తాను ఎంపీగా ఉన్నప్పుడు రూ.1000 కోట్లతో స్మార్ట్ సిటీ, జాతీయరోడ్లు, కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్, కేబుల్ బ్రిడ్జి, ఐటీ టవర్ తదితర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కేంద్రంతో పోరాడి తీసుకువచ్చామని మాజీ ఎంపీ వినోద్ అన్నారు. ఎంపీగా ఐదేళ్లలో బండి సంజయ్ ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒక నవోదయ ఉండాలని, మన రాష్ట్రంలో బండి సంజయ్ ఒక్క నవోదయ కూడా తేలేకపోయాడని విమర్శించారు. తాను లోక్‌సభలో మొత్తం 106 సార్లు రాష్ట్ర, కరీంనగర్ ప్రయోజనాలపై గళమెత్తానని, బండి సంజయ్ పార్లమెంటులో ఎన్నిసార్లు మాట్లాడారని ప్రశ్నించారు. మొన్న అసెంబ్లీలో ఓడిన వ్యక్తికి పార్లమెంటులో ఏం పని అని? ఇదేమైనా పునరావాస కేంద్రమా? అని నిలదీశారు. సీఎంగా కేసీఆర్ గెలిచి ఉంటే మేడిగడ్డలో దగ్గరుండి మరమ్మతులు చేయించేవారన్నారు.

కేసీఆర్ రాకతో నేల పులకరించింది: గంగుల



కేసీఆర్ కరీంనగర్‌లో అడుగుపెట్టగానే ఈ నేల పులకించిపోయిందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించినప్పుడు కేసీఆర్ కరీంనగర్ గడ్డ నుంచే సింహగర్జన చేశారని, ఆ తర్వాత విజయవంతంగా లక్ష్యాన్ని సాధించారని గంగుల గుర్తుచేశారు. ఉద్యమంలో ఆమరణ దీక్ష నుంచి రైతుబంధు, దళితబంధులాంటి పథకాలకు కరీంనగర్ నేలమీద నుంచే కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోసం ఈ కరీంనగర్ గడ్డ నుంచే కదనభేరి మోగించేందుకు కేసీఆర్ వచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



కేసీఆర్‌కు గద బహూకరిస్తున్న వీర్ల వెంకటేశ్వర్లు



గంగుల నివాసంలో మాటామంతీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

తాను సీఎంగా ఉన్నప్పుడు ఎకరమైనా ఎండలేదని, మూడునెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు పంటలకు నిప్పు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల కోసం కరీంనగర్ కదనభేరి పేరిట నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన భారీబహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్, బీజేపీపై నిప్పులు చెరిగారు. కరీంనగర్ చాలా చైతన్యమున్న గడ్డ అని.. అందుకే తాను పదవులను విసిరికొట్టి ఇదే నేలనుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం చేపట్టినట్లు గుర్తుచేశారు. కరీంనగర్ చైతన్యవంతమైన జిల్లా, పోరాటాల పురిటిగడ్డ అన్నారు. 2001, మే17న ఇదే ఎస్ఆర్ఆర్ కళాశాల వేదికగా 'సింహ గర్జన' పేరిట నిర్వహిస్తే కరీంనగర్ జనాలు తెలంగాణ జెండాను ఆకాశానికి ఎత్తుకున్నారని గుర్తుచేశారు.మాట ఇచ్చి తప్పడం కాంగ్రెస్‌కు అలవాటేనని, నాడు తమ పొత్తుతో గెలిచావని ఎగతాలి చేస్తే.. రాజీనామా చేసి రెండున్నర లక్షలఓట్ల మెజారిటీతో తాను కరీంనగర్ ఎంపీగా తిరిగి గెలిచానన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే.. దానికి మరమ్మతులు చేయకుండా వదిలేయడమేంటని ప్రశ్నించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎకరమైనా ఎండలేదని, ఇప్పుడు కరెంటు, నీళ్లు ఎలా మామయ్యాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టి ఎల్ఎండీ, ఎంఎండీలు నింపితే ఎండాకాలం చెరువులు మత్తళ్లు దూకాయన్నారు. 420 పథకాలు ప్రకటించి ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మూడు నెలలకే వాటిని నెరవేర్చలేక తనను తిట్టడం పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో సిరిసిల్ల చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆపేందుకు తాను రూ.50 లక్షలు సేకరించి ఇచ్చానని, వారికి తిరిగి ఉపాధి కల్పించేందుకే బతుకమ్మ చీరలు, పిల్లలకు యూనిఫాంల ఆర్డర్స్ ఇచ్చామని వివరించారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెడుతున్న బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ఇబ్బందులు పెట్టడమేంటని, తాము అధికారంలో ఉన్నప్పుడు అలాచేసి ఉంటే కాంగ్రెస్ వాళ్లు మిగిలేవాళ్లు కాదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎవరూ మనస్ఫూర్తిగా జై తెలంగాణ అనలేరని, తెలంగాణ దళం, తెలంగాణ బలం బీఆర్ఎస్సేనని అన్నారు. కరీంనగర్ సహా అన్ని పార్లమెంటు స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

బండి రూ.10 పనైనా చేసిండా?

కరీంనగర్ ఎంపీగా ఐదేళ్లు ఉన్న సమయంలో కరీంనగర్‌ను హైదరాబాద్‌తో కలిపే కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా, జాతీయ రహదారులు, ఇతర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు తెచ్చిన సమర్థుడు వినోద్ అని ప్రశంసించారు. ఐదేళ్ల కాలంలో బండి సంజయ్ రూ.పది పని అయినా చేసిండా? అని ప్రశ్నించారు. ఇప్పటికే మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయి గోస పడుతున్నారని, మరోసారి అలా అవొద్దని హెచ్చరించారు. ఇలాంటి సమయంలో ఢిల్లీలో, పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినబడాలంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేలా బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.



సభలో రసమయి బాలకిషన్ ఆటాపాట

అక్రమ నిర్మాణాలపై టాస్క్‌ఫోర్స్ కొరడా

- రెడ్డి సేవా సంక్షేమ సంఘం భవనం సీజ్
- సెట్‌బ్యాక్ పాటించని కట్టడాలు పాక్షికంగా తొలగింపు
- మంథనిలో ఉద్రిక్తత పరిస్థితులు.. భారీగా పోలీసుల మోహరింపు



అధికారులు సీజ్ చేసిన రెడ్డి సేవా సంక్షేమ భవనం



రాఘవులునగర్‌లో తొలగిస్తున్న గోడ


మంథని: మంథని మున్సిపాలిటీలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ కొరడా ఝులిపించింది. హైకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యం మేరకు వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ అక్రమ కట్టడాలను కూల్చివేశారు. బాధితుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవ్వడంతో పరిస్థితి హై టెన్షన్‌కు దారితీసింది. టాస్క్ ఫోర్స్‌లోని ఐదుగురు కమిటీ సభ్యుల బృందంలో టీం లీడర్, మంథని డిప్యూటీ తహసీల్దార్ సిరిపురం గిరి, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్, టీపీఏ యశ్వంత్, ఫైర్ అధికారి సదానందం, ఆర్‌అండ్‌బీ ఏఈ,తో పాటు ఎస్సై వెంకటకృష్ణ పోలీస్, మున్సిపల్ సిబ్బందితో రంగంలోకి దిగారు. మొదట పట్టణంలోని రెడ్డి సేవా సంక్షేమ సంఘ భవనాన్ని సీజ్ చేసి రెడ్ రిబ్బన్ కట్టి పురపాలక సంఘం పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అనంతరం మరో నాలు కట్టడాలను పాక్షికంగా కూల్చివేశారు. కట్టడాలు కూల్చివేసే క్రమంలో పలువురు మహిళలు అడ్డుతగలడంతో పోలీసులు వారిని పక్కకు తప్పించారు. కూల్చివేయొద్దని ప్రాధేయపడి కన్నీటి పర్యంతమయ్యారు. కాగా అక్రమ కట్టడాలను తామే స్వయంగా కూల్చివేసుకుంటామని సమయం కావాలని బాధితులు లిఖితపూర్వకంగా టాస్క్‌ఫోర్స్ కమిటీకి రాసి ఇవ్వడంతో అధికారులు అక్కడి నుంచి కదిలారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతతో పట్టణంలో నాలుగు గంటలకు పైగా హైరానా వాతావరణం నెలకొంది.

హైకోర్టు ఆదేశాల మేరకు..

మంథనిలో అక్రమ నిర్మాణాలు.సెట్ బ్యాక్ పాటించకుండా కట్టడాలు జరుగుతున్నాయని హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలైనట్లు టాస్క్‌ఫోర్స్ టీం లీడర్, మంథని డిప్యూటీ తహసీల్దార్ సిరిపురం గిరి తెలిపారు. ఈమేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.. రెడ్డి సేవా సంక్షేమ సంఘం భవనం, పెద్దపల్లి రోడ్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట నవ్య నిర్మించిన భవనం కొంత మేరకు పాక్షికంగా తొలగించి సీజ్ చేసినట్లు తెలిపారు. మరో మూడు కట్టడాలను పాక్షికంగా తొలగించామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోనే చేరండి

- ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద డిగ్రీ అధ్యాపకుల ప్రచారం
- కరపత్రాలు పంపిణీ



కరపత్రాలతో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పెద్దపల్లిరూరల్: మా డిగ్రీ కాలేజీలో చేరండి..అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన సౌకర్యాలున్నాయంటూ మంగళవారం పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మినర్సయ్య సారథ్యంలో అధ్యాపక బృందం ప్రభుత్వ కాలేజీల వద్ద ప్రచారం నిర్వహించారు. మా కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్‌లాబ్, డిజిటల్ లైబ్రరీ లాంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయంటూ పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీతో పాటు సుల్తానాబాద్, కమాన్‌పూర్, గర్రెపల్లిలో కరపత్రాలు పంపిణీ చేశారు. బాలికలకు కాలేజీ ఆవరణలోనే ప్రత్యేక వసతిగృహం ఉందన్నారు. బాలురకు కూడా సమీపంలోని పెద్దపల్లిలో హాస్టళ్లు ఉన్నాయని వివరించారు. కాలేజీలో ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థులకు ఉపాధి అవకాశాల నైపుణ్యాలను పెంపొందించడం ఉపాధి కల్పించేలా సహకరిస్తామని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. అధ్యాపకులు నితిన్, మేజర్ రేల్ల సంజీవ్, శ్రీనివాస్, రామకృష్ణ, అర్జున్, రవీందర్‌రావు, కిరణ్మయి, సునీత, రజిత, సతీశ్, రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: పార్లమెంటుకు జరుగనున్న ఎన్నికలకు అధికారయంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, పెండింగ్ ఓటరు దరఖాస్తులు తదితర అంశాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారిపేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని సూచించారు. కొత్తగా నమోదైన ఓటర్లకు కార్డులు జారీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను పరిశీలించి వసతులు కల్పించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు మధుమోహన్, హనుమనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చదువే కుటుంబ ప్రగతికి పునాది



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- పేరెంట్, టీచర్ మీటింగ్‌లతో మెరుగైన ఫలితాలు
- వేసవి సెలవుల్లో సమ్మర్‌క్యాంపు స్కూళ్ల నిర్వహణ
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రస్తుత సమాజంలో ఉన్న ఆర్థిక అంతరాలు విద్యతో మాత్రమే తగ్గుతాయని, చదువే కుటుంబ ప్రగతికి నాంది పలుకుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన పేరెంట్, టీచర్స్ సమావేశం (పీటీఎం)లో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదిగితే ఆ కుటుంబ ఆర్థికస్థితిగతులు మారుతాయన్నారు. అందుకే ప్రతీ విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని సాధనలో ముందుండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, వసతులు కల్పించేందుకు అవసరమైన విషయాలపై చర్చించేందుకు పేరెంట్, టీచర్స్ మీటింగ్ దోహదపడతాయన్నారు. ప్రతినెలా పీటీఎం సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశ తేదీని నిర్ణయించి ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభాపాటవాలు, నైపుణ్యాలు వారి తల్లిదండ్రులకు తెలిసేలా సమావేశాల్లో ప్రదర్శింపజేయాలని తెలిపారు. పేరెంట్స్‌తో ప్రతీ విద్యార్థి వ్యవహారశైలిపై చర్చించాలన్నారు. పిల్లలకు వారి ఇల్లే తొలి పాఠశాల అని, ఇంటివద్ద ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా చదువుకునేలా ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా తల్లిదండ్రులను చైతన్యపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. తొమ్మిది నెలుగా జిల్లాలో పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లు నిర్వహిస్తుండటంతో విద్యార్థుల హాజరుశాతం గణనీయంగా పెరిగిందని అన్నారు. మంచి మార్పులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి ఫలితంగానే హాజరు 90శాతంగా ఉందన్నారు. పాఠ్యాంశాలు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా టీఎల్ఎం పద్ధతిని పాటిస్తున్నారని తెలిపారు. సమావేశంలో డీఈవో మాధవి, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షేక్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహారమే మేలు

కొర్రలు..సామలు, అరికెలు, ఊదలు లాంటి చిరుధాన్యాల్లో అధిక పోషకవిలువలుంటాయని, వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం పోషణపక్షం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 9నుంచి 23వరకు చేపట్టిన పోషణ పక్షం కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఆర్డీలు మధుమోహన్, హనుమానాయక్, జిల్లా సంక్షేమశాఖాధికారి రవుఫ్‌ఖాన్, కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, డీసీపీవో కమలాకర్, హసీబ్ తదితరులు పాల్గొన్నారు.

18న మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

మంథని: మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను 18న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎన్నికల నిర్వహణకు మంథని ఆర్డీవో హనుమా నాయక్‌ను అధికారిగా నియమించారు. కాగా గతనెల 16న మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ. వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్‌లపై మెజార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో పదవులు కోల్పోయారు. నూతన చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికకు ఆదేశాలు జారీ అయ్యాయి.

క్లుప్తంగా

డెంగీతో యువకుడు మృతి


నందన్ (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన గాజుల నందన్ (24) డెంగీ బారినపడి చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. గ్రామానికి చెందిన గాజుల శ్రీనివాస్– రమ దంపతులకు కూతురు, కొడుకు నందన్ ఉన్నారు. నందన్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఫొటోషూట్‌లో శిక్షణ పొందుతున్నాడు. 18రోజుల క్రితం డెంగీ బారిన పడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందాడు. ఆయన అవయవాలను కుటుంబసభ్యులు దానం చేశారు.

ఉరేసుకుని ఆత్మహత్య

జ్యోతినగర్(రామగుండం): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్టీపీసీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూపోరట్‌పల్లి మేరకాలనీకి చెందిన బుట్టి వేణు (33) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలలుగా మద్యానికి బానిసై సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి చూసేసరికే మృతి చెందాడు.మృతుడికి భార్య స్వర్ణతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి తండ్రి బీమయ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెద్దబొంకూర్‌లో మరో వ్యక్తి..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌కు చెందిన ఎనగందుల సంజీవరాజు (46) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంజీవరాజు మద్యానికి బానిసై అదే మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఏఎస్సై రామస్వామి తెలిపారు. మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీచింగ్ పోస్టు ఖాళీ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సైనిక్ శిక్షణ గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎన్డీఏ సోషల్ స్టడీస్ బోధించుటకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 18న జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ లచ్చయ్య కోరారు. ఎంఏ బీఈడీ, పదేళ్ల అనుభవం కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకి హాజరు కావాలని, డెమో నిర్వహించి ఎంపిక చేస్తామని, ఎంపికైన అభ్యర్థికి నెలకి రూ.50 వేల పారితోషికం ఉంటుందన్నారు.

ఆరుగురు వ్యక్తుల బైండోవర్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురిని తహసీల్దార్ డి.పుష్పలత ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణ చేస్తున్న మాన్వాడకు చెందిన కొమురయ్య, సంతోష్, ప్రసాద్, బోయినపల్లికి చెందిన ప్రభాకర్, తరచూ భూముల విషయంలో గొడవలు పడుతున్న బూర్గుపల్లికి చెందిన శ్రీనివాస్, మల్లేశంను బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గోదావరిఖని: మున్సిపల్ ఆఫీస్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాజీవ్‌రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శారదనగర్‌కు చెందిన పాండ్రే రాజేంద్రకుమార్(52) తీవ్రంగా గాయపడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ద్విచక్రవాహనంపై మున్సిపల్ ఆఫీస్ ఎదుట నుంచి మంచిర్యాల వైపు వెళ్తుండగా, మంచిర్యాల నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈప్రమాదంలో రాజేంద్రకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు


ధర్మపురిలో ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణాలు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

- 20 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు..
- ధర్మపురిలో కొనసాగుతున్న పనులు

ధర్మపురి: ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈనెల 20నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలతోపాటు నిజామాబాద్, నిర్మల్, ఆర్మూర్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. వారికి సరిపడా కల్పించాల్సిన వసతులపై ఆలయ అధికారులు శాఖల వారీగా ప్రణాళిక రూపొందించుకున్నారు.

అధికారుల పక్కా ప్రణాళిక

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలు, రాజగోపురాలు, బ్రహ్మపుష్కరిణి వద్ద, గోదావరిలో చలువ పందిళ్లు, స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు తడకలతో డ్రెస్సింగ్ రూంలు, షెడ్లు, తాగునీటి వసతి కల్పిస్తున్నారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే భక్తుల కోసం పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ముద్రించి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఆలయాలు, రాజగోపురాలు, స్వాగత తోరణాలకు రంగురంగుల విద్యుదీపాలంకరణకు చర్యలు తీసుకుంటున్నారు.
- బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో పాతనీటిని తొలగించి కొత్త నీటిని నింపుతున్నారు.
- కోనేరులోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు.
- భక్తులకు ఆలయం తరపున, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ఆలయంతోపాటు గోదావరి తీర ప్రాంతాల్లో చలివేంద్రాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.
- అన్నదానం కోసం రైసుమిల్లర్లు, ఆర్యవైశ్యులు, వర్తక సంఘం, ఇతర దాతల సహకారం తీసుకుంటున్నారు.
- జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సుమారు 400 మంది పోలీస్ బందోబస్తుకు చర్యలు చేపడుతున్నారు.
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను పరిశీలిస్తున్నారు.
- స్వామివారి కల్యాణానికి ఆలయంలో స్థలం ఇరుకుగా ఉన్నందున మరోచోట చేయించడానికి చర్యలు చేపడుతున్నారు.
- భక్తుల భద్రత నిమిత్తం ఆలయం, గోదావరి తీరప్రాంతం, బస్టాండ్ ఏరియా, ప్రధాన కూడళ్లలో దేవస్థానం, పోలీస్ సంయుక్త పర్యవేక్షణలో 60వరకు సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నారు.

నేటి నుంచి ‘దానాపూర్’ సేవలు

- అందుబాటులోకి మెరుగైన ప్రయాణ సౌకర్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, ప్రయాణికులు


జమ్మికుంట రైల్వే స్టేషన్

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రముఖ వ్యాపార కేంద్రం జమ్మికుంట పట్టణంలోని రైల్వే స్టేషన్ సాంకేతికత పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంది. ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌తో ఇక్కడి నుంచి రోజూ కాగజ్‌నగర్, నాగపూర్, రామగుండం, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు గతంలో ఉదయం సమయాల్లో భాగ్యనగర్ రైలు రోజులో ఒక్కటి మాత్రమే ఉండేది. సుమారు 14గంటల తర్వాత అదే రైలులో ప్రయాణం చేయాల్సి వచ్చేది. కాగా, దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంటలో హాల్టింగ్ కల్పించడంతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండనుంది.

సికింద్రాబాద్ టూ దానాపూర్..

బుధవారం నుంచి జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌తో సేవలు ప్రారంభంకానున్నాయి. దేశవ్యాప్తంగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ టూ బిహార్ రాష్ట్రంలోని దానాపూర్ రైల్వేస్టేషన్ వరకు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ నడవనుండగా, జమ్మికుంటలో రోజూ ఉదయం 11.39 గంటలకు హాల్టింగ్ ఉంటుంది. తిరిగి దానాపూర్ రైల్వే స్టేషన్ టూ సికింద్రాబాద్ వెళ్లే క్రమంలో జమ్మికుంట స్టేషన్‌లో రోజూ సాయంత్రం 5.24 గంటలకు హాల్టింగ్ ఉండనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు

కేంద్ర ప్రభుత్వ నిధులతో జమ్మికుంట స్టేషన్‌లో ఆధునిక వసతులు కల్పించారు. రూ.10 కోట్లతో మూడో లైన్, రూ.11 కోట్లతో సిగ్నల్ టెక్నాలజీ, అత్యాధునిక స్టేషన్ మేనేజర్ రూమ్, టెలీ కమ్యూనికేషన్ సిస్టం, సీసీ కెమెరాలు, డిజిటల్ డిస్‌ప్లే, కోచ్ డిస్‌ప్లే బోర్డు, రైల్వే స్టేషన్ ప్రాంగణంలో తారు రోడ్డు, గార్డెనింగ్, ప్లాట్ ఫామ్స్, బారికేడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే బల్లార్ష నుంచి కాజీపేట వరకు మూడోలైన్ పనులు పూర్తయ్యాయి. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ రైళ్ల రాకపోకలు సాగించే వీలుంటుంది.

వినియోగించుకోవాలి



జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ఈ నెల 13 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలి. – పి.చంద్రమౌళి, రైల్వే స్టేషన్ మేనేజర్, జమ్మికుంట

ఎంపీ సంజయ్ కృషితో..



జమ్మికుంట స్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఉండేలా చూడాలని స్థానిక వ్యాపారులు ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు విన్నవించారు. దీంతో కేంద్ర మంత్రితో ఎంపీ మాట్లాడి హాల్టింగ్ కోసం కృషి చేశారు. ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు. – జీడి మల్లేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, జమ్మికుంట

సింగరేణిలో భారీగా అధికారుల బదిలీలు

గోదావరిఖని: సింగరేణి సంస్థలో 20 మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సీఆర్‌పీ/పీఈఆర్/సీ/26/775పేరున మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అధికారి పేరు	హోదా	ప్రస్తుతం బదిలీ
హబీబ్‌హుస్సేన్	జీఎం(క్వాలిటీ)	ఓఎస్‌డీ, భూపాల్‌పల్లి
డి.రాంచందర్	జీఎం,మణుగూరు	సీఎండీ,హైదరాబాద్
కేహెచ్‌ఎన్‌గుప్తా	జీఎం,బెల్లంపల్లి	సేఫ్టీ,రామగుండం
డి.లలిత్‌కుమార్	జీఎం, కొత్తగూడెం	జీఎం,మణుగూరు
కె.రఘుకుమార్	ఏజీఎం,రామగుండం	సేఫ్టీ,బెల్లంపల్లి రీజియన్
బండి వెంకటయ్య	ఏజీఎం,భూపాల్‌పల్లి	ఎస్టేట్, కార్పొరేట్
వి.కృష్ణయ్య	ఏజీఎం, మణుగూరు	హెచ్‌ఆర్‌డీ,జీఎం
శీలం కవీంద్ర	డీవైజీఎం,భూపాల్‌పల్లి	ఎస్‌వోటూజీఎం,భూపాల్‌పల్లి
ఎస్.వెంకటాచారి	డీవైజీఎంపీవో,జేవీఆర్	ఎస్టేట్, కార్పొరేట్
ఎస్‌వీఆర్‌ప్రహల్లాద్	డీవైజీఎం పీఓ, కోయగూడెం	పీవో,జేవీఆర్,ఓసీపీ
వి.శ్రీనివాస్‌రావు	డీవైజీఎం,ప్రాజెక్టుఅండ్‌ప్లానింగ్	పీవో,కోయగూడెం
ఎస్.వెంకటేశ్వర్‌రావు	డీవైజీఎం ఏవో, కేటీకే–8	ఎస్‌ఓటూజీఎం,ఆర్జీ–2
వి.భిక్షమయ్య	డీవైజీఎం,కేటీకే–2,ఓసీపీ	ఏవో,కేటీకే–8
బి.కృష్ణప్రసాద్	ఎస్‌వోఎం,ఎన్విరాన్,భూపాల్‌పల్లి	మేనేజర్,కేటీకే–2
ఎస్.భూశంకరయ్య	ఎస్‌వోఎం,కేటీకే–5	కాసిపేట్–1
షేక్ అల్లావుద్దీన్	కా.మేనేజర్ కాసిపేట్–1	కేకే–5
బి.మల్లేశం	అ.మేనేజర్,జీడీకే–11	జేవీఆర్,ఓసీ–2
జి.దుర్గాప్రసాద్‌రావు	అ.మేనేజర్,జేవీఆర్ఓసీ–2	ఆర్అండ్‌డీ,కార్పొరేట్
ప్రసాద్	అ.మేనేజర్,ప్రాజెక్టుఅండ్‌ప్లానింగ్	జీడీకే–11
టి.పోషమల్లు	అ.మేనేజర్,కార్పొరేట్	ఎన్విరాన్, భూపాల్‌పల్లి

‘వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్’ స్టాల్ ప్రారంభం

- వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోదీ


వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాళ్లను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

పెద్దపల్లిరూరల్/రామగుండం: అమృత్ భారత్ రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించడంలో భాగంగా మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో పలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దపల్లి, రామగుండం రైల్వే స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాళ్లను, రాఘవాపూర్‌లో ఏర్పాటు చేసిన షెడ్, సుల్తానాబాద్‌లో పీఎంగతిశక్తి కార్గో టెర్మినల్‌ను ప్రారంభించారు.రైల్వే వ్యవస్థను అన్ని విధాల అభివృద్ధి చేయడం ద్వారా సామాజిక, ఆర్థికాభ్యున్నతి సాధించామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. పెద్దపల్లి జంక్షన్ రైల్వేస్టేషన్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో పాటు బీజేపీ నాయకులు కొంతం శ్రీనివాసరెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రామగుండంలో కార్పొరేటర్ సతీశ్‌కుమార్, జెడ్పీటీసీ సంధ్యారాణి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్


ఉపముఖ్యమంత్రికి సమస్య వివరిస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి రామగుండం విద్యుత్ థర్మల్ కేంద్ర విస్తరణే ప్రధాన లక్ష్యంగా అనుమతులు కోరినట్లు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఎన్నో సహజవనరులతో పాటు అన్ని రకాల సదుపాయాలు ఉన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతం మసకబారి పోయిందన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రధానంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మూతపడుతున్న బీపవర్‌హౌస్ థర్మల్ విద్యుత్ ప్లాంట్ విస్తరణ ప్రధాన లక్ష్యంగా 1800 మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్‌ను రామగుండంలో నెలకొల్పితే మళ్లీ పునర్వైభవం వస్తుందన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. త్వరలోనే రామగుండం థర్మల్ కేంద్రాన్ని 1800 మెగావాట్ల విద్యుత్ తయారీ కేంద్రంగా విస్తరింపజేసే ప్రక్రియను అధికారికంగా ప్రకటన విడుదల చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ ఎండీ ముస్తఫా, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దూళికట్ట సతీశ్, డివిజన్ అధ్యక్షుడు మాటూరి సత్యప్రసాద్ తదితరులున్నారు.

సకాలంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించండి


ఫీజు చెల్లించిన వారికి రెన్యువల్ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్ కిరణ్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని అన్ని వ్యాపార సంస్థలు సకాలంలో డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ ఫీజులను ఈనెల 31లోగా అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.44 లక్షలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 89శాతం వసూలైందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 100 శాతం లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. 2023–24 సంబంధించి ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించని వ్యాపార సంస్థల నిర్వాహకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా, స్థానిక విశాల్ మెగా మార్ట్ నిర్వాహకులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.99,596 ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించగా, నిర్వాహకులను మున్సిపల్ కమిషనర్ అభినందించారు. హెల్త్ అసిస్టెంట్ కిరణ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది మంగళవారం ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

గొల్లపల్లి: మండలంలోని వెన్గుమట్లకు చెందిన జంగిలి రాజవ్వ(90) చేద బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. రాజవ్వ 10ఏళ్లుగా బీపీ, షుగర్‌తో బాధపడుతోంది. మందులు వాడుతున్నా తగ్గలేదు. జీవితంపై విరక్తి చెందిన చేద బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. రాజవ్వ కొడుకు జంగిలి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి

ఇబ్రహీంపట్నం: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌కు చెందిన రాజారపు నరేష్(32) మంగళవారం వేములకుర్తిలో ఓ శుభకార్యానికి వచ్చాడు. స్వగ్రామానికి వెళ్తుండగా వేములకుర్తి శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే.. ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కథలాపూర్(వేములవాడ): మండలంలోని దుంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన బత్తుల రామకృష్ణ (33) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణ కొద్దిరోజులుగా మండలకేంద్రంలో నివాసముంటూ చింతకుంటలో సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. సోమవారం రాత్రి చింతకుంట నుంచి కథలాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా.. దుంపేట శివారులో అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎన్‌హెచ్‌ఎం పోస్టులకు రూ.3 లక్షలు?

- వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల బేరసారాలు!
- అభ్యర్థుల్లో ఆందోళన
- పైరవీలకు తావులేదంటున్న అధికారులు
- జిల్లాలో 45 పోస్టులకు 1,780 దరఖాస్తులు


దరఖాస్తులు అందిస్తున్న అభ్యర్థులు (ఫైల్)

కరీంనగర్‌టౌన్: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద వైద్యారోగ్య శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. 8 విభాగాల్లో 45 పోస్టులకు ఏకంగా 1,780 దరఖాస్తులు వచ్చాయి. 4 వైద్యాధికారి పోస్టులకు 13, 21 స్టాఫ్‌నర్సు పోస్టులకు 821, 13 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు 216, ఒక ప్రోగ్రాం అధికారి పోస్టుకు 51, ఒక ఏఎస్‌ఎం పోస్టుకు 216, 3 ఫార్మసిస్టు పోస్టులకు 298, ఒక డీఈవో పోస్టుకు 154, ఒక ఆప్టోమెట్రిక్ పోస్టుకు 11 మంది అర్జీ పెట్టుకున్నారు.

మెరిట్ అభ్యర్థుల లిస్టు తీసుకొని..

ఎన్‌హెచ్‌ఎం కింద జరిగే నియామకాలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా మెరిట్ ఆధారంగా చేపడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. దరఖాస్తుల గడువు ఈ నెల 2తో ముగిసిన వెంటనే వైద్యారోగ్య శాఖలో పనిచేసే కొంతమంది ఉద్యోగులు చేతివాటం ప్రదర్శనకు తెరలేపినట్లు తెలిసింది. దరఖాస్తు చేసుకున్నవారిలో మెరిట్ అభ్యర్థుల లిస్టు తీసుకొని, మధ్యవర్తుల సహకారంతో వారిని మభ్యపెట్టే పనిలో పడినట్లు సమాచారం. ఎన్‌హెచ్‌ఎం కింద కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్న ఈ పోస్టులు భవిష్యత్తులో రెగ్యులరైజ్ అయ్యే అవకాశం ఉందని ఆశ చూపుతూ.. రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఖర్చవుతుందని బేరసారాలకు దిగుతున్నట్లు తెలిసింది. దీంతో ఇప్పటివరకు మెరిట్ ప్రకారమే పోస్టుల భర్తీ జరుగుతుందని భావించిన అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగాల భర్తీ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు చేసి, దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత మెరిట్ ప్రకారం ఉద్యోగాలు ఇస్తాం. ఇందులో ఎలాంటి పైరవీలకు తావులేదు. బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు. – డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగాలకు పైరవీలు కొనసాగుతున్నాయన్న ప్రచారంతో చాలామంది వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న తమ సన్నిహితులు, బంధువులు, ఇతర తెలిసిన వారితో పైరవీల గురించి మాట్లాడే పనిలో పడ్డారు. ఎవరిని కలిస్తే పని అవుతుంది.. ఎవరి ద్వారా కలవాలంటూ ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ పోస్టులన్నీ కలెక్టర్ నేతృత్వంలో పారదర్శకంగా భర్తీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. డబ్బులున్నవారు పైరవీకారుల కోసం ప్రయత్నిస్తుండగా పేద, మధ్య తరగతి అభ్యర్థులు మాత్రం ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, పోస్టుల భర్తీలో అవకతవకలకు చోటు లేకుండా చూడాలని కోరుతున్నారు.

నేడు ఆసుపత్రి భవన నిర్మాణానికి భూమిపూజ

గోదావరిఖని: మెడికల్ కళాశాలలో 355 పడకల ఆసుపత్రి భవనానికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా బుధవారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సింగరేణి యాజమాన్యం కేటాయించిన రూ.142 కోట్లతో 355పడకల ఆసుపత్రి భవనాన్ని ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్‌తో పాటు అధికారులు పాల్గొననున్నారు.

మంథనిలో టూరిజం అభివృద్ధికి చర్యలు


గోదావరి తీరంలో పరిశీలన చేస్తున్న ఆర్డీఓ, అధికారులు

మంథని: మంథని నియోజకవర్గంలో టూరిజం అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు రెండు రోజుల పర్యటనకు టూరిజం శాఖ ఎనిమిది సభ్యుల బృందం పరిశీలన చేస్తోంది. ఈమేరకు మంగళవారం మంథనిలో పర్యటించారు. గోదావరి తీరంతో పాటు గౌతమేశ్వరస్వామి ఆలయం, సమీపంలోని పురాతన ఆలయాలను టూరిజం బృందం పరిశీలించింది. శ్రీమహాలక్ష్మీ శ్రీశీలేశ్వర..సిద్ధేశ్వర ఆలయం, సమీపంలోని రావుల చెరువును చూశారు. బుధవారం రామగిరి ఖిల్లా, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని పర్యాటక శాఖ అధికారులు పర్యటించనున్నారు. మంథని ఆర్డీవో హనుమా నాయక్, తహసీల్దార్ రాజయ్య, టూరిజం శాఖ కన్సల్టెంట్ బండ శ్రీనివాస్, ప్రాజెక్టు జీఎం ఉపేందర్‌రెడ్డి, సభ్యులు కిశోర్‌కుమార్, అనుప, మౌనిక, రాంకుమార్, తదితరులు ఉన్నారు.

బస్సు దిగబోయి.. ప్రమాదానికి గురై..

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రగతినగర్ స్టేజీ వద్ద బస్సు దిగబోయిన వృద్ధురాలు ప్రమాదానికి గురై గాయపడింది. సులోచన అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి కరీంనగర్ నుంచి పెద్దపల్లికి బస్సులో రాగా.. ప్రగతినగర్ స్టేజీ వద్ద బస్సుదిగబోతున్న సమయంలో బస్సు కదలడంతో కిందపడటంతో కాలుకు తీవ్ర గాయమైంది. ఆమెను చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కాగా సులోచన కరీంనగర్ నుంచి పెద్దపల్లికి బంధువుల వద్దకు వచ్చినట్లు తెలిసింది.

తగ్గుతున్న గుండారం రిజర్వాయర్ నీటి మట్టం

- ఆందోళన చెందుతున్న రైతులు
- ఎస్సారెస్పీ కెనాల్ నీటితో నింపాలని డిమాండ్


గుండారం రిజర్వాయర్


తగ్గిన నీటి మట్టం

కమాన్‌పూర్: గతేడాది పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడి అలుగుపారిన గుండారం రిజర్వాయర్‌లో రోజురోజుకూ నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 12 అడుగులు కాగా ప్రస్తుతం అడుగు మేర మాత్రమే నీటి నిల్వ ఉంది. రిజర్వాయర్‌లోకి నీటిని తరలించేందుకు ఎస్సారెస్పీ నుంచి వచ్చే డీ83 కెనాల్, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వచ్చే టూటీఎంసీ పైపులైన్ ఉంది. అయితే ఎల్లంపల్లిలో కూడా నీటిమట్టం లేకపోవడంతో పైపులైన్ నుంచి నీటి సరఫరాను నిలిపేశారు. రిజర్వాయర్ పరిధిలో కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాల్లోని రైతులు రబీసాగులో వరి పంట సాగు చేశారు. సాగునీరు అందకపోవడంతో చివరి ఆయకట్టు పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. డీ83 కెనాల్ నుంచి నీటిని విడుదల చేసి రిజర్వాయర్‌ను పూర్తిస్థాయి నీటి మట్టంతో నింపి సాగు చేసిన పంట పొలాలు ఎండిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.